బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసిన గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్.

- కార్వాన్

కార్తిక పూజలు

కార్తికమాసం పూజల్లో భాగంగా కార్వాన్ ఉప్పర్ బస్తీలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో శనివారం దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు.

- కార్వాన్

ఇంటింటికీ కుటుంబ సర్వే

ఈ నెల 6 నుంచి 30 వరకు చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ఎన్యుమరేటర్ శ్రీవిద్య అన్నారు. కుటుంబ సర్వేలో భాగంగా గోల్నాకలోని ఖర్కానాలైన్ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి వివరాలను నమోదు చేశారు.

- కాచిగూడ

దేశరక్షణలో .. ఎన్‌సీసీ క్యాడెట్‌లు

సైఫాబాద్ సైన్స్ కళాశాల నుంచి త్రివిధ దళాల్లో తొమ్మిది మంది ఆఫీసర్లు

ఈ నెల 30న కళాశాలలో ఘనంగా జాతీయ ఎన్‌సీసీ దినోత్సవం

సైఫాబాద్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్‌లు (ఫైల్)

సుల్తాన్‌బజార్, నవంబర్ 23 : ' ఓ భుజంపై విద్య, మరో భుజంపై దేశ రక్షణ ' నినాదంతో క్రమశిక్షణ, మంచి నడవడికతో ముందుకు సాగుతూ సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు విజయాలను సాధిస్తున్నారు. కళాశాల నుంచి ఇప్పటివరకు త్రివిధ దళాల్లో ఆఫీసర్లుగా 9 మంది చేరడం గర్వకారణం. నగరం నడిబొడ్డున మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాల విద్యార్థులు నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత స్థానాల్లో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఐఏఎస్, ఐపీఎస్, రాజకీయ నాయకులను అందించిన సామాజిక సరస్వతి నిలయంగా తనకంటూ ముద్రను వేసుకున్నది. ' చదువు.. పరిశోధన.. సామాజిక అవగాహన' నినాదంతో ముందుకు దూసుకుపోతున్న సైఫాబాద్ సైన్స్ కళాశాల దేశ రక్షణ కోసం తన ఒడిలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అడుగులు నేర్పి దేశ రక్షణకు కదన రంగాన ముందుంచుతున్నది. జాతీయ ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా నమస్తే ప్రత్యేక కథనం.

సైఫాబాద్ కళాశాల నుంచి ..

ఐక్యత, క్రమశిక్షణ అనే ప్రధాన లక్ష్యంతో త్రివిధ దళాల్లో ప్రధానంగా నిలిచింది. 1948లో ఎన్‌సీసీ మొట్టమొదటి సారి ఆవిర్భవించగా,1949లో బాలికలకు సమాన హక్కులను కల్పిస్తూ బాలికల విభాగం మొదలైంది. ఎన్‌సీసీ ప్రధానంగా కళాశాల, పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక సైనిక శిక్షణతో పాటు డ్రిల్, చిన్న ఆయుధాల శిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక అవగాహన కల్పించే కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛంద సంస్థ పాఠశాల స్థాయిలో ఏ సర్టిఫికెట్, కళాశాల స్థాయిలో బీ, సీ సర్టిఫికెట్లతో పాటు అనేక శిక్షణ శిబిరాల్లో స్థానం కల్పిస్తున్నారు. ఎన్‌సీసీ క్యాడెట్‌లు సీ సర్టిఫికెట్ సాధిస్తే డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీ, పునేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, చెన్నయ్‌లోని ఓటీఏలలో నేరుగా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది. కళాశాల ప్రధాన ద్వారం వద్దనే ఉత్తేజాన్ని నింపే బోర్డు దర్శనమిస్తుంది. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశించిన విద్యార్థులకు ప్రత్యేక పరీక్షల ద్వారా ఎన్‌సీసీకి ఎంపిక చేస్తారు. శిక్షణలో భాగంగా ఫైరింగ్, డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాల్లో తర్ఫీదు ఇచ్చి గణతంత్ర దినోత్సవ పరేడ్(ఆర్‌డీ పరేడ్), జాతీయ సమైఖ్యత శిబిరం (ఎన్ఐసీ), తల్ సైనిక్ క్యాంపు (టీఎస్‌సీ), ప్రధాన మంత్రి ర్యాలీ (పీఎం ర్యాలీ), యూత్ ఎక్స్చేంజి, పర్వతారోహణ క్యాంపులో శిక్షణ ఇస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు గడిచిన ఐదేండ్లలో పదుల సంఖ్యలో ఆర్‌డీ పరేడ్‌కు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆర్‌డీసీ క్యాంప్ కోసం క్యాడెట్లు 45 రోజుల శిక్షణ తీసుకొని, అనేక క్యాంపుల్లో ప్రతిభను చాటారు. ఈ ఏడాదిలో 9 మంది త్రివిధ దళాల్లో ఎంపిక కాగా.. ఒకరు మహిళ కావడం విశేషం. నేవీలో నిచిత నావికా దళంలో ఆఫీసర్‌గా ఎంపికై శిక్షణ పొందుతున్నారు.

సామాజిక అవగాహనలో..

సైఫాబాద్ సైన్స్ కళాశాలలోని 3టి తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్‌లు సామాజిక అవగాహనలో పాలుపంచుకుంటున్నారు. ఇందులో భాగంగా పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీతో పాటు కళాశాలలో ఏటీసీ ట్రేనింగ్ క్యాంపును నిర్వహించారు.

చాలా ఆనందంగా ఉంది

- విద్యార్థి సిద్ధార్థ్, ఎన్‌సీసీ క్యాడెట్

సైఫాబాద్ సైన్స్ కళాశాల నా జీవితాన్ని తీర్చిదిద్దింది.గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన నేను ఎన్‌సీసీ క్యాడెట్‌గా శిక్షణ తీసుకున్న అనంతరం ఆల్ ఇండియన్ సైనిక్ క్యాంపు అరుణాచల్ ప్రదేశ్‌లో 16, 410 అడుగుల పర్వతారోహణను విజయవంతంగా పూర్తి చేయడం ఆనందంగా ఉంది.

కల్నల్ శరత్ అందిస్తున్న సహకారం మరువలేనిది

- విద్యార్థిని నిచిత, నేవీ ఆఫీసర్‌గా జాయిన్ అయిన ఎన్‌సీసీ క్యాడెట్

సైఫాబాద్ సైన్స్ కళాశాలలో శిక్షణ తీసుకున్న నాకు దేశ రక్షణ వ్యవస్థలో అవకాశం రావడం సంతోషంగా ఉన్నది. కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్‌ల శిక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఉన్నది. ఎన్‌సీసీ అధికారి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో నేవీలో ఉద్యోగం సంపాధించేందుకు దోహదం చేసింది. ఇది జీవితంలో మరువలేనిది . తెలంగాణ 3 బెటాలియన్ కల్నల్ శరత్ అందిస్తున్న సహకారం మరువలేనిది.

ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునే విధంగా శిక్షణ

- లెఫ్టినెంట్ డాక్టర్ పల్లాటి నరేశ్, ఎన్‌సీసీ ఆఫీసర్, సైఫాబాద్ సైన్స్ కళాశాల

ప్రస్తుత విద్యా వ్యవస్థలో విద్యార్థులు ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునే విధంగా శారీరకంగా, మానసికంగా సిద్ధం చేస్తున్నాం. రానున్న రోజుల్లో కళాశాల నుంచి తమ పాత్రను రెట్టింపు చేస్తాం. ఇటీవల కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్‌లకు నాగ్‌పూర్‌లో నిర్వహించిన క్యాంపులో లెఫ్టినెంట్ హోదాను సాధించడం జరిగింది. ఇదే స్ఫూర్తితో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు మరింత మెరుగైన శిక్షణను అందిస్తాం.

ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగు

అంబర్‌పేట తాసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, నవంబర్ 23 : పేదింటి ఆడబిడ్డల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. శనివారం అంబర్‌పేట తాసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాసీల్దార్ మీరాబాయి, కార్పొరేటర్లు విజయ్ కుమార్‌గౌడ్, బి.పద్మావెంకట్‌రెడ్డి తదితరులతో కలసి 182 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ

రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతి పత్రం అందజేస్తున్న గోషామహల్ కార్పొరేటర్ లాల్ సింగ్

అబిడ్స్, నవంబర్ 23 : తెలంగాణలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల వివక్ష చూపుతూ బీసీల ఎదుగుదలను అడ్డుకుంటుందని గోషామహల్ డివిజన్ కార్పొరేటర్ లాల్‌సింగ్ అన్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్(బీసీడబ్ల్యూడీ) అధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల అధ్యయనంలో భాగంగా బహిరంగ విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గోషామహల్ డివిజన్ కార్పొరేటర్ లాల్‌సింగ్ బీసీల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వివరిస్తూ కొన్ని డిమాండ్లు, సూచనలను కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బీసీ సంక్షేమ శాఖక మిషనర్ బాలలక్ష్మి పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

ఆశ వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ శనివారం ఆశ వర్కర్లు మారేడ్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో తలసానిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో అనేక హామీలను ఇచ్చిందని అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హామీలు అమలు చేయడం లేదని తెలిపారు. ఉమాదేవి, విజయలక్ష్మి, శశికళ పాల్గొన్నారు.

- బేగంపేట్

ఆకట్టుకున్న కర్నాటక గాత్ర కచేరి

రవీంద్రభారతి, నవంబర్ 23 : చంద్రిక మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం రవీంద్రభారతిలో నిర్వహించిన కర్నాటక గాత్ర కచేరి ఆహూతులను ఆకట్టుకున్నది. యువ గాయకుడు స్కంద వెలువల్లి తొలి గాత్రకచేరి లోనే అద్భుతంగా రాణించి వీక్షకుల మనసు దోచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హైదరాబాద్ సిస్టర్స్ లలిత, హరిప్రియలు జ్యోతి ప్రజ్వలనం చేసి గాత్రకచేరిని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మృదంగ విద్వాంసుడు యల్లా వెంకటేశ్వరరావు, హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ఆచార్య జగదీశ్వరావు, డాక్టర్ కృష్ణ, డాక్టర్ డీఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.

ఎంబీఏ వన్ టైం చాన్స్ పరీక్ష తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని ఎంబీఏ వన్ టైం చాన్స్ సప్లిమెంటరీ పరీక్ష తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్, నాన్ సీబీసీఎస్) వన్‌టైం చాన్స్ అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించామని, పరీక్షలను అదే రోజు నుంచి నిర్వహిస్తున్నప్పటికీ, వివిధ పరీక్ష తేదీలను మార్చినట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంపీఈడీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని బీఏ ఓరియంటల్ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 5వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 10వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎల్ ఎల్ ఎం జవాబు పత్రాల నకలుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: ఓయూ పరిధిలోని ఎల్ఎల్ఎం పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ ఎల్ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

డీడీఎంఎస్ ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 23: దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ ఒకేషనల్ కోర్స్ సెంటర్‌లో పలు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్స్), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత 10వ తరగతి అని వివరించారు. రేడియోగ్రఫీ అసిస్టెంట్, రెస్పిరేటరీ థెరపీ టెక్నీషియన్, ఈసీజీ, మెడికల్ ల్యాబ్, కార్డియాలజీ, క్యాథ్‌ల్యాబ్, పర్‌ఫ్యుజన్ టెక్నీషియన్ల వంటి పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు కనీస అర్హత ఇంటర్మీడియట్ అని చెప్పారు. అన్ని వయసుల వారు కోర్సుల్లో చేరేందుకు అర్హులని తెలిపారు. కోర్సుల్లో చేరేందుకు ఈనెల 30వ తేదీ ఆఖరు అని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 83090 37134, 63058 95867 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కాచిగూడ, నవంబర్ 23: శంషాబాద్ రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (55)శంషాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం-2 చివర్లో కొంతకాలంగా అనారోగ్యంగా ఉంటూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై నీలి రంగు చొక్క, లేత నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.3 ఉన్నట్లు తెలిపారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు అదృశ్యం

కాచిగూడ, నవంబర్ 23: కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఏఎస్సై మోతీలాల్ వివరాల ప్రకారం.. గోల్నాక డివిజన్ సుందర్‌నగర్‌కు చెందిన శివయ్య కుమారుడు ఎం.నర్సింహులు(74) అక్టోబర్ 5వ తేదీన ఇంట్లోంచి వెళ్లి రాకపోవడంతో అక్క లక్ష్మి శనివారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంట్లోంచి వెళ్లేటప్పుడు తెలుపు ధోవతి, ఆకుపచ్చ రంగు చొక్క ధరించి, ఎత్తు 5.2 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సోదరి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు.

రైళ్లలో దొంగతనాలు

కాచిగూడ, నవంబర్ 23: సెవెన్‌హిల్స్ రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, నగదు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. కూకట్‌పల్లిలోని కేబీహెచ్‌బీకి చెందిన అరుణాకుమారి సెవెన్‌హిల్స్ రైల్లో కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. తర్వాత బ్యాగు చూసుకునేసరికి 43 గ్రాముల బంగారు ఆభరణాలు,రూ.10 వేలు కనిపించలేదు. శనివారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వెంకటాద్రి రైల్లో..

వెంకటాద్రి రైల్లో ప్రయాణికుని బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. మణికొండకు చెందిన కె.కిరణ్‌కుమార్ వెంకటాద్రి రైల్లో కుటుంబ సభ్యులతో కలిసి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు.
అనంతరం బ్యాగు చూసుకునేసరికి అందులో 12 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. శనివారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

నిజాం కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటరాజశేఖర్

సుల్తాన్‌బజార్, నవంబర్ 23 : నిజాం కళాశాల ప్రిన్సిపాల్‌గా కరీంనగర్ జగిత్యాలకు చెందిన ప్రొ.అనుమల్ల వెంకట రాజశేఖర్ బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం నిజాం కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన ప్రొ. భీమా భూక్యా పదవీ కాలం పూర్తి కావడంతో ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ. ఎం. కుమార్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలను స్వీకరించారు.1995లో ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీతో విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆయన దోమలగూడలోని ఏవీ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు.1996లో సికింద్రాబాద్ పీజీ కళాశాలలో పార్ట్‌టైం లెక్చరర్‌గా జాయిన్ అయ్యారు.1997లో నిజాం కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి 2007 వరకు ఈ కళాశాలలోనే కొనసాగారు. 2008లో ఓయూకి బదిలీపై వెళ్లి అక్కడ హెచ్ వోడీగా, జువాలజీ ప్రొఫెసర్‌గా కొనసాగారు. అకాడమిక్ కో - ఆర్డినేటర్, కంట్రోలర్ ఆఫ్ ఎవాల్యుయేషన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా పరిపాలన విభాగంలో పనిచేసిన అనుభవం ఉన్నది. విద్యార్థినుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు లైబ్రరీని మెరుగపరిచి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

అభినందనలు

నిజాం కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను స్వీకరించిన ప్రొఫెసర్ వెంకటరాజశేఖర్‌ను శనివారం అయిస్టర్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే, రాష్ట్ర కార్యదర్శి షేక్ సోహైల్, ఆయిస్టర్ అగ్రికల్చర్ మినిస్టర్ అరవింద్, నిజాం కళాశాల యూనిట్ సభ్యులు వెంకటేశ్, రాజు, శివ, మహేశ్, రాహుల్, తనిష్క పూలమొక్కను అందించి అభినందనలు తెలిపారు.

- సుల్తాన్‌బజార్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మెహిదీపట్నం, నవంబర్ 23 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.రఘుకుమార్ అన్నారు. శనివారం లంగర్‌హౌస్ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు దూసరి శ్రీధర్‌గౌడ్, స్థానిక నాయకులు ఇంద్రసేనారెడ్డి, గోవర్ధన్‌రావు, పాండు, కృష్ణాయాదవ్, వినేష్‌సింగ్, పూర్ణ చంద్రరావు, నాగేంద్రప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల పర్యటన

మల్లేపల్లి డివిజన్‌లో ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలతో పలు సమస్యలపై చర్చించారు. మౌలిక సదుపాయాలు కల్పించడానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

- మెహిదీపట్నం

టోలిచౌకి డివిజన్‌లో శనివారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ పర్యటించి ప్రజలతో మాట్లాడారు. బస్తీలు, కాలనీలలో ప్రజలకు సమస్యలు లేకుండా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు.

- మెహిదీపట్నం

సంక్షేమ పథకాలతో పేదల కెంతో మేలు



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మురా గోపాల్

చిక్కడపల్లి, నవంబర్ 23: ముషీరాబాద్ మండల కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ముషీరాబాద్ మండల పరిధికి సంబంధించిన 135 షాదీముబారక్, 107 కల్యాణలక్ష్మి, అదే విధంగా హిమాయత్‌నగర్ మండల కార్యాలయానికి సంబంధించిన 24 కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ నిరుపేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతుందని, దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ త్వరితగతిన చెక్కులు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముషీరాబాద్ తాసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కవాడిగూడ కార్పొరేటర్ రచణశ్రీ, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియ, రాంగనర్ కార్పొరేటర్ రవిచారి, బీఆర్ఎస్ నియోజకవర్గ డివిజన్ల అధ్యక్షులు శ్యామ్‌యాదవ్, శంకర్‌ముదిరాజ్, రాకేశ్‌కుమార్, వై.శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, నాయకులు గడ్డమీది శ్రీనివాస్, పెంటారెడ్డి, సాయి, శ్రీనివాస్‌గుప్తా, పున్న సత్యనారాయణ, పాశం రవి, శివముదిరాజ్, ఎయిర్‌టెల్ రాజు, కాంగ్రెస్ నాయకులు బాబ్జీ, అభిషేక్ కెనెడీ, గుండు జగదీశ్‌బాబు పాల్గొన్నారు.